క్లుప్తంగా

చలో తుని విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన చలో తుని కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని, దౌర్జన్యాలు చేస్తోందని ఆరోపించారు. పిఠాపురం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లేందుకు సిద్ధం కావాలన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసం మూడో సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకాన్ని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయంలోని ఉప ఆలయాలు, పెద్ద నంది, మూలవిరాట్‌ను భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని సినీ నటుడు బాలాజీ దర్శించుకున్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

భద్రాచలం చేరిన రథ యాత్ర

మార్చి 3న విగ్రహాల ప్రతిష్ఠ



భద్రాచలం చేరిన రామభక్తుల రథయాత్ర

సామర్లకోట: గొంచాల గ్రామం నుంచి ఈ నెల 8న భీష్మ ఏకాదశి పర్వదినాన సీతారాముల రథంతో పాదయాత్రగా బయలుదేరిన భక్త బృందం సోమవారం భద్రాచలం చేరినట్లు భక్త బృందం ప్రతినిధి గురుస్వామి వాసుదేవ సుబ్బారావు స్థానిక విలేకర్లకు తెలిపారు. గొంచాల గ్రామం నుంచి సుమారు 200 మంది భక్తులు పాదయాత్రగా బయలు దేరిన విషయం విదితమే. తొమ్మిది రోజుల పాటు పాదయాత్ర సాగిందని, 14వ సారి పాదయాత్రగా బయలు దేరిన భక్త బృందం గతేడాది నుంచి సీతారాముల రథంతో పాదయాత్ర చేస్తున్నారు. దారి పొడవునా భక్తులకు అల్పాహారం, భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేసిన దాతలకు ఈ సందర్భంగా వాసుదేవ సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. గొంచాల గ్రామంలో దాతల సహకారంతో రామాలయ నిర్మాణం జరుగుతుందని, మార్చి 3న విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని చెప్పారు. పాదయాత్రకు బృంద ప్రతినిధులు వింటి బాబ్జి, పేర్నిడి వెంకటరమణ, వెంకటేశ్వరరావు, యేలూరి శ్రీనివాసు, పేర్నిడి సత్యనారాయణ, బావిశెట్టి వెంకట సత్యప్రసాద్ నాయకత్వం వహించారు.

సారా బట్టీపై పోలీసుల దాడి



కొమరగిరిలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు తోటలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో సోమవారం సారా బట్టీపై దాడి చేశారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సహకరించాలని ఎస్సై వెంకటేష్ కోరారు. సారా తయారీకి వినియోగించే బెల్లాన్ని విక్రయించడం, సారా తయారీ, విక్రయం కూడా నేరమేనన్నారు. అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మృత్యు నీడన కోడి

- పిఠాపురంలో బర్డ్ ఫ్లూ కలకలం
- ఫారాల్లో భారీఎత్తున చనిపోతున్న కోళ్లు
- మూడు రోజుల్లో వేల సంఖ్యలో మృత్యువాత
- శాంపిళ్లు సేకరించిన పశు సంవర్ధక శాఖ అధికారులు

పిఠాపురం: గత మూడు రోజులుగా ఫారాల్లో గుట్టలు గుట్టలుగా కోళ్ల మృతి చెందుతుండడంతో పిఠాపురం నియోజకవర్గంలో బర్డ్ ఫ్లూ వచ్చిందన్న ప్రచారం కలకలం సృష్టించింది. పిఠాపురం, పిఠాపురం మండలం కుమారపురం, చిత్రాడ, నర్సింగపురం, గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన కోళ్ల ఫారాల్లో మూడు రోజులుగా ఆకస్మికంగా వందలాది కోళ్ల మృతి చెందడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఫారం యజమానులు సంబంధిత కోళ్ల సప్లయి చేసిన కంపెనీకి సమాచారం అందించగా, కంపెనీ ప్రతినిధులు చనిపోయిన కోళ్ల శాంపిళ్లను తీసుకెళ్లారు. ఆయా సంఘటనలతో పిఠాపురంలో బర్డ్ ఫ్లూ సోకిందన్న వార్త తెలిసి స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారాల్లో కోళ్లు ఆకస్మికంగా కొట్టుకుని చనిపోవడం గమనించిన రైతులు వెంటనే వాటిని వేరు చేయడం ప్రారంభించారు. కొన్ని గంటల వ్యవధిలోనే వందల కోళ్లు మృతి చెందడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ అధికారులు హుటాహుటిన ఆయా ఫారాలకు వెళ్లి పరిశీలించారు. కోళ్ల మృతికి కారణాలను పరిశీలించిన అధికారులు.. ఆయా ఫారాల్లో కోళ్ల శాంపిళ్లను సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి, పరీక్షల అనంతరం దేనివల్ల చనిపోయాయన్నది నిర్ధారిస్తామని చెబుతున్నారు.

ఖాళీ అయిన కోళ్ల ఫారాలు

వందల కోళ్ల మృత్యువాత పడడంతో నియోజకవర్గంలో కోళ్ల ఫారాలు ఒక్కసారిగా ఖాళీ అయ్యాయి. కొన్ని ఫారాల్లో కోడి పిల్లలు సైతం మృత్యువాత పడుతుండడంతో తీవ్ర నష్టాల పాలయ్యామని రైతులు వాపోతున్నారు. పిఠాపురం పట్టణంతో పాటు, పిఠాపురం మండలం కుమారపురం, చిత్రాడ, నర్సింగపురం, గొల్లప్రోలు మండలం చెందుర్తి తదితర ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఒక్క కోడి కూడా మిగలకుండా మృతిచెందినట్టు యజమానులు చెబుతున్నారు. మూడు రోజుల్లో సుమారు లక్ష కోళ్లు మృతి చెందినట్టు సమాచారం.

పూడ్చి పెట్టడం నిజమేనా..?

వ్యాధి సోకి మృతి చెందుతున్న కోళ్లను జన సంచారం లేని ప్రాంతాల్లో గోతులు తీసి, పూడ్చి పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ అలా చేసినట్లు ఎక్కడా దాఖలాలు కనిపించడం లేదు. వాటిని నిజంగా పూడ్చి పెడుతున్నారా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తొండంగి మండలం ఏవీ నగరానికి చెందిన చేపల చెరువుల్లో వందల కోళ్ల కళేబరాలు తేలి కనిపించడంతో, ఫారాల్లో మృతి చెందిన కోళ్లను చేపలు, రొయ్యల చెరువుల్లో వేస్తున్నట్లు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఏవీ నగరంలో చోటుచేసుకున్న సంఘటన చనిపోయిన కోళ్లను పూడ్చి పెట్టకుండా, అక్రమంగా తరలించి చెరువుల్లో వేస్తున్నారన్న అనుమానాలను నిజం చేస్తోందంటున్నారు. మృతి చెందిన కోళ్లను పూడ్చిపెట్టాలని సూచించి అధికారులు వెళ్లిపోగానే, వాటిని ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగి ఉంటే వ్యాధి విస్తృతంగా వ్యాప్తి చెంది, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం పూడ్చి పెట్టిస్తున్నామని చెబుతున్నారు.

> **కంగారు పడాల్సిన పని లేదు**
>
> మాకు వచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు వివిధ ప్రాంతాల్లో కోళ్లు మృతి చెందిన ఫారాలను సోమవారం పరిశీలించాం. ఈ వ్యాధి ఇతర కోళ్లకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన బయో సెక్యూరిటీ చర్యలు వివరించాం. చనిపోయిన కోళ్లను కాకినాడ ఏడీడీఎల్ ల్యాబ్ టెక్నీషియన్లతో వ్యాధి నిర్ధారణ చేసేందుకు శాంపిళ్లు సేకరించారు. చనిపోయిన కోళ్లను ప్రజా సంచారానికి దూరంగా గొయ్యి తీయించి, సున్నం బ్లీచింగ్ వేయించి, ఒక మీటర్ లోతు గోతిలో కప్పిపెట్టాలని ఆదేశించాం. ఎటువంటి భయాందోళన లేకుండా ఉడికించిన మాంసం, గుడ్లు తినవచ్చు. వాటి వలన ఎటువంటి అనారోగ్యం కలగదు. కోళ్ల ఫారాల వద్ద ప్రజా, వాహన సంచారాన్ని నియంత్రించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పాలి బయో సెక్యూరిటీ పద్ధతులు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
>
> – డా.సూర్యప్రకాశరావు, సంయుక్త సంచాలకుడు, పశు సంవర్ధక శాఖ, కాకినాడ జిల్లా



పిఠాపురం మండలం కుమారపురంలో ఖాళీగా ఉన్న కోళ్ల ఫారం



పిఠాపురం మండలం చిత్రాడలో చనిపోయిన కోళ్లు



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

హామీలు నెరవేర్చాలంటూ అంగన్‌వాడీల ధర్నా



పెద్దాపురంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పెద్దాపురం: తమకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలంటూ పెద్దాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల సమ్మెతో మట్టి ఖర్చులకు రూ.20 వేలు జీవో తెచ్చుకుంటే, కూటమి ప్రభుత్వం రూ.15 వేలకు మార్చేసిందన్నారు. వివిధ రకాల సర్వేల పేరుతో అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యతతో సరఫరా చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబీ, ఎస్తేరు రాణి, నాగమణి, అమల, టీఎల్ పద్మావతి, స్నేహలత, లోవలక్ష్మి, సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, జి.పెంటయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ఆందోళన

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, సీఐటీయూ నాయకులు కె.చిన్న మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సమ్మె నిర్వహించగా అప్పటి ప్రభుత్వం స్పందించి ఒప్పందాల్లో భాగంగా జీవోలు విడుదల చేశారని గుర్తుచేశారు. ఆ జీవోల ప్రకారం మట్టి ఖర్చులు రూ.20 వేలలో రూ.5 వేలు తగ్గించి రూ.15 వేలే ఇస్తామని ప్రస్తుత ప్రభుత్వం చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు గ్యాస్ సదుపాయం కల్పించాలని, ప్రభుత్వం ఇస్తున్న రూ.11 వేల జీతం ఏమాత్రం సరిపోనందున సుప్రీం కోర్టు నిర్దేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నెలకు రూ.26 వేల వేతనం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లు తగ్గించేశారని విమర్శించారు. పెంచాల్సింది పోయి తగ్గించడం సమంజసం కాదన్నారు. పెంచిన పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధనకు దశలవారీ ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ శాంత, వెంకటలక్ష్మి, భవాని, పి.బేబీ, నాగగణిక, సూర్యకాంతం, సత్యవతి సీఐటీయూ నాయకులు విశ్వనాథం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువుగా మారుతున్న జగనన్న కాలనీ

తాగునీటి పైపులైన్ల లీకేజీలే కారణం



సామర్లకోట జగనన్న కాలనీలో పైపులైన్ లీకేజీతో చెరువుగా మారిన ప్రదేశం

సామర్లకోట: తాగునీటి పైపులైన్ల మీదుగా భారీ వాహనాల రాకపోకల కారణంగా జగనన్న కాలనీ చెరువుగా మారింది. పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోయి, ఖాళీ స్థలంలో నిలిచిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని పేద ప్రజల కోసం విలువైన ఈటీసీ స్థలాలను సేకరించి జి.రాగంపేట రోడ్డులో సుమారు రెండు వేల మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. సుమారు 1,200 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వారి కోసం తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్లు లీకేజీ కావడంతో నీరు నిలిచిపోయిన ప్రదేశంలో దోమలు పెరిగిపోతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగు నీరు పైపుల్లోకి చేరే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. రెండు ప్రదేశాల్లో లీకేజీలు ఏర్పడినట్టు గుర్తించినా, ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి జ్ఞాన జ్యోతి శిక్షణ

సామర్లకోట: మండలంలోని 165 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు మంగళవారం నుంచి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ప్రాథమిక అభ్యాసాన్ని మెరుగుపరిచేలా జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. 18 నుంచి 20 వరకు ఒకటి, 22 నుంచి 25వ తేదీ వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణ ఉంటుందన్నారు. పట్టణ పరిధిలోని వారికి స్థానిక అయోధ్య రామపురంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, మండల పరిధిలోని వారికి ఉండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, కూర్మారావు ఇన్‌చార్జిలుగా ఉంటారని, తాను కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఉండూరులో 94 మందికి, సామర్లకోటలో 71 మందికి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, సీడీపీఓ ఉషారాణి, ఎంఈఓ–2 పి.పుల్లయ్య శిక్షణ ఇస్తారన్నారు.

మైనర్ బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సామర్లకోట: మాధవపట్నం గ్రామంలో మైనర్ బాలిక మృతి అనుమానాస్పదంగా మారింది. పోలీసులు, పంచాయతీ కార్యదర్శి తోట సత్యం, గ్రామ ప్రజల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సామర్లకోటకు చెందిన అనుసూరి విఘ్నేష్, మాధవపట్నానికి చెందిన సిద్ధాంతల లక్ష్మీదేవి(16) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గతంలో పెళ్లి చేసుకునేందుకు వీరు యత్నించగా, మైనర్ వివాహం పేరుతో అధికారులు నిలుపుదల చేశారు. ఇటీవల పెళ్లి చేసుకుని మాధవపట్నంలోనే కాపురం పెట్టారు. నాలుగు రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో సోమవారం లక్ష్మీదేవి మృతదేహం ఫ్యానుకు చీరతో ఉరి వేసుకున్నట్టుగా వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. ఫ్యానుకు వేలాడుతున్న ఆమెను కిందకు దించి, స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దాంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మంగళవారం తమ కుమార్తె పుట్టిన రోజు అని, ముందు రోజే మరణించిందని తల్లిదండ్రులు రోదించారు. కాగా బాలిక మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో, విఘ్నేష్ స్థానిక పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలిసింది. సీఐ ఎ.కృష్ణభగవాన్ సోమవారం రాత్రి సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తెను మానసికంగా చిత్రహింసలకు గురి చేసి, బలవన్మరణానికి పాల్పడేలా చేసిన విఘ్నేష్‌పై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలంటూ తల్లిదండ్రులు భద్రం, కుమారి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో కోరారు. కాగా నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ఆర్థిక సంక్షోభంలో దేశం

కాకినాడ సిటీ: ఫాసిస్ట్ పాలన సాగుతున్న నేటి కాలంలో విప్లవకార్ల ఐక్యత అత్యంత ఆవశ్యకమని, దోపిడీ, పీడన నుంచి విముక్తి కావాలంటే దేశ ప్రజలకు విప్లవాలే శరణ్యమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సమావేశం పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులు విలీన సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, మరుకుర్తి ఏసు, గుబ్బల ఆదినారాయణ మాట్లాడారు. ఎన్డీఏ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై పన్నుల భారం, ధరల భారం మోపుతూ, అంబానీ, అదానీ లాంటి పెద్ద పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ దేశాన్ని లూటీ చేయడానికి అవకాశం కల్పిస్తుందని విమర్శించారు. ప్రజలను మౌలిక సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికి మత విద్వేషాలు రెచ్చగొడ్తుందన్నారు. ఉత్తర భారతదేశంలో, ఈశాన్య భారతదేశంలో మత కల్లోలాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మణిపూర్ అందుకు తాజా ఉదాహరణ అని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి నూతన జాతీయ వ్యవసాయ విధానాన్ని తీసుకురావాలని చూస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని విమర్శించారు. ప్రస్తుతం దేశం దారుణంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూపాయి విలువ మరింత దిగజారి, ద్రవ్యోల్బణం పెరిగి, ధనవంతులు మరింత ధనవంతులు గాను, పేదలు మరింత పేదలుగా దిగజారారన్నారు. ఇలాంటి ఫాసిస్ట్ పాలనలో దేశ ప్రజలకు విప్లవకారుల ఐక్యత అత్యంత ఆవశ్యకమన్నారు.

పోలీసు బీట్ పోయె.. గడియారం సెంటర్ వచ్చె..



పోలీసు రింగ్ సెంటర్‌ను తొలగిస్తున్న పొక్లెయిన్

సామర్లకోట: పట్టణంలోని బస్సు కాంప్లెక్స్ తర్వాత ఉన్న ప్రాంతాన్ని పోలీసు బీట్ సెంటర్‌గా పిలిచే వారు. ఆ పోలీసు బీట్ సెంటర్ పేరు కాస్తా.. గడియారం సెంటర్‌గా మారనుంది. పెద్దాపురం, పిఠాపురం రోడ్ల కూడలి ప్రదేశంలో నిత్యం ప్రమాదాలు జరగడంతో, అప్పటి మున్సిపల్ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు సూచనల మేరకు సుమారు 30 ఏళ్ల క్రితం విమల్ బాట్లింగ్ వారు పోలీసు విధులు నిర్వహించే విధంగా రింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రింగ్ సెంటర్‌కు గుర్తుగా విమల్ బాట్లింగ్ సింబల్‌తో పోలీసు రింగ్ సెంటర్ ఉండేది. ప్రారంభంలో పోలీసులు విమల్ బాట్లింగ్ యూనిట్ నిర్మాణం చేసిన రింగ్ సెంటర్‌లో ఉండి విధులు నిర్వహించే వారు. దాంతో దానిని పోలీసు రింగ్ సెంటర్‌గా పిలిచే వారు. క్రమేపీ పోలీసులు రింగ్ బయటే ఉండి విధులు నిర్వహించే వారు. కొంత కాలానికి ఆ సెంటర్‌లో పోలీసులు విధులకు స్వస్తి చెప్పారు. పెద్దాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప ఈ సెంటర్‌లో గడియార స్తంభం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్మాణం పూర్తి కావడం, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండటంతో, గడియారం స్తంభానికి సమీపంలో ఉన్న పోలీసు రింగ్ సెంటర్‌ను పొక్లెయిన్‌తో సోమవారం తొలగించారు. దాంతో ఈ సెంటర్‌కు గడియారం సెంటర్ పేరు స్థిరపడే అవకాశం ఉంది.

ప్రాణ రక్షణకు హెల్మెట్ ధారణ కీలకం



పెద్దాపురంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న మరణాలను నియంత్రించేందుకు సహకరించాలని ఎస్సై మౌనిక కోరారు. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ సోమవారం స్థానిక మున్సిపల్ సెంటర్ నుంచి ఆదిత్య విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి, సురక్షిత ప్రయాణంతో గమ్యస్థానాలకు చేరాలన్నారు. హెల్మెట్ ధరించక పోవడం వల్ల చాలామంది ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శిరస్త్రాణాన్ని భారంగా భావించరాదని, ప్రాణం విలువైనదని చెప్పారు. పోలీస్, రవాణా అధికారులు కేసులు రాస్తారనే భావనతో కాకుండా, తమ ప్రాణ రక్షణ కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నారని వాహనదారులు గుర్తించాలన్నారు.

ప్రతి గ్రామానికి తాగు నీరందేలా చర్యలు

జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు



కాపవరంలోని ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న సీఈఓ లక్ష్మణరావు

సామర్లకోట: కాపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్ ప్లాంటు నుంచి ఆయా గ్రామాలకు తాగునీరు అందజేయడానికి జిల్లా పరిషత్ నుంచి సహకరిస్తామని జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం కాపవరం గ్రామంలోని ఫిల్టర్‌బెడ్‌ను ఆయన పరిశీలించారు. పీబీసీ ద్వారా ఫిల్టర్ చెరువులోకి నీరు వచ్చే విధానాన్ని, ఫిల్టర్ ప్లాంటులో నీరు శుద్ధి తీరుతెన్నులను పరిశీలించారు. కాపవరం నుంచి ఉండూరు, వీకే రాయపురం, పి.వేమవరం, గొంచాల, అచ్చంపేట, నవర, పవర గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సీఈఓకు వివరించారు. పైపులైన్ల లీకేజీల కారణంగా సక్రమంగా తాగునీరు అందడం లేదని కాపవరం సర్పంచ్ కుంచం మాధవరావు సీఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి గ్రామానికి తాగునీరు అందే విధంగా ఏర్పాట్లు చేయాలని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేట పరిధిలో పేకాట శిబిరంపై దాడి చేసి, ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై మౌనిక తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విలేకర్లకు వివరాలు చెప్పారు. ఈ దాడిలో నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.6,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోండి

పడా పీడీ శ్రీధర్



పాఠశాలలో సమస్యలపై ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్

పిఠాపురం: విద్యార్థుల తాగునీరు విషయంలో సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పడ పీడీ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఆయన గొల్లప్రోలు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. జనవరి నుండి వాటర్ సప్లై యూనిట్ పని చేయకపోవడంపై ఆరా తీశారు. టీడీఎస్ శాతం 1630 రావటం ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకురాగా, మున్సిపల్ వాటర్ రావడానికి ఉన్న అవకాశాలు, ఇతర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పడ అభివృద్ధికి సంబంధించి క్షేత్ర స్థాయిలోనే ఎక్కువ పర్యటనలు ఉంటాయని, ప్రజల అవసరాల మేరకు సమస్యలను గుర్తించి, పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు. 17 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అవసరాల మేరకు సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో కొన్ని సమస్యలు వచ్చాయని తెలిపారు. ఆయన వెంట ఏపీడీ వసంత మాధవి, ఎంఈఓ–2 శివప్రసాద్ తదితరులున్నారు.